

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గద్దమీది బాలరాజు | మంగళవారం 03-02-2026 | సంపుటి - 26 | సంచిక -255 | రూ : 4 | పేజీలు: 8


కాంగ్రెస్ ప్రభుత్వానికి

## సుప్రీంలో ఎదురుదెబ్బ

- సోషల్ మీడియా పోస్టులపై అప్పీల్ తిరస్కరణ



2లో

అడ్డంగా సంపాదించి..అధికార దుర్వినియోగం చేసి

## వేలకోట్లు కూడాబెడితే ప్రశ్నించవద్దా

- బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ సిఎం రేవంత్
- రావినారాయణరెడ్డి లాంటి నేతలు అరుదని కితాబు



2లో



2లో

శబరిమలలో

## మరో వివాదం...

- నిబంధనలు ఉల్లంఘించి సినిమా షూటింగ్!
- నిబంధనలకు విరుద్ధంగా సినిమా షూటింగ్ జరిపిన వైనం
- చిత్రీకరణ నిజమేనని తేల్చిన దేవస్వం విజిలెన్స్ విచారణ

**ఇప్పుడు రేవంత్ రెడ్డికి సమాచారం ఎలా వస్తుందో, నాడు కేసీఆర్‌కు అలాగే వచ్చింది: కేటీఆర్**

2లో



2లో

ఏపీ, తెలంగాణలకు

## హైస్పీడ్ రైళ్లు గేమ్ ఛేంజర్..

- బెంగళూరుకు 2 గంటల్లో చేరుకోవచ్చు: అశ్వినీ వైష్ణవ్
- తెలంగాణ, ఏపీ, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందన్న కేంద్రమంత్రి
- బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,454 కోట్లు కేటాయింపు
- హైదరాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరుకు మూడు హైస్పీడ్ రైళ్లు రానున్నాయని వెల్లడి

ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై

## కవిత కీలక వ్యాఖ్యలు

- సిట్ పిలిస్తే విచారణకు వెళతానన్న జాగృతి అధ్యక్షురాలు
- విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు
- త్వరగా పూర్తిచేసి దోషులను శిక్షించాలని డిమాండ్



2లో

రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి

# వైకాపా కుట్రలు

- అలజడి సృష్టించేందుకే ఆ పార్టీ నేతలు బూతులు
- ఆ పార్టీ ట్రాప్‌లో పడితే వారికీ.. మనకీ తేడా ఉండదు
- లడ్డూ కల్తీ వ్యవహారంలో వైకాపా అడ్డంగా దొరికిపోయింది
- అందుకే ఫ్రస్టేషన్‌లో నానా యాగీ చేసే ప్రయత్నాలు
- వైకాపా కుట్రలతో టిడిపి నేతలు జాగ్రత్తగా ఉండాల్సిందే
- పార్టీ నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

2లో





2లో

మోదీకి ట్రంప్

## ఫోన్ కాల్..

- ప్రధాని మోదీతో మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- భారత్‌అమెరికా వాణిజ్య చర్చల నేపథ్యంలో ఈ సంభాషణ
- "స్టే ట్యూన్డ్" అంటూ ఎక్స్ వేదికగా తెలిపిన యూఎస్ అంబాసిడర్
- విదేశాంగ మంత్రి జైశంకర్ అమెరికా పర్యటన రోజే ఈ పరిణామం
- సంభాషణ వివరాలపై ఇరు దేశాల నుంచి స్పష్టత రావాల్సి ఉంది

తెలుగు రాష్ట్రాల్లో

## పులి సంచారం కలకలం

- కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ప్రచారం
- తొర్రేడులో పులిజాడతో ప్రజల భయాందోళన
- అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారుల హెచ్చరిక
- పులిని పట్టుకునేందుకు బోను, సిసి కెమెరాల ఏర్పాటు



2లో

## తెలుగు రాష్ట్రాల్లో
# పులి సంచారం కలకలం

రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం మండలంలోని తొర్రేడులో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. పెద్దపులి దాడిలో మృతి చెందిన రెండు ఆవులు, దూడ కళేబరాలను వారు గుర్తించారు. పెద్దపులిని పట్టుకునేందుకు తొర్రేడు తోటల్లో పులిబోను, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం రూరల్, కోరుకొండ, సీతానగరం మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు డీఈవో సోమవారం సెలవు ప్రకటించారు. పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలోని ప్రజల్ని, పర్యాటకుల్ని అధికారులు అప్రమత్తం చేశారు. ఛత్తీస్‌గఢ్ నుంచి రెండు పెద్ద పులులు జనారణ్యంలోకి వచ్చినట్టు అటవీ అధికారులు భావిస్తున్నారు. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద పులుల సంచారం కలకలం రేపుతున్నాయి. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పులుల సంచారం ఎక్కువైపోయింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలనుంచి తెలుగు రాష్ట్రాల్లోకి వచ్చిన పులులు అలజడి సృష్టిస్తున్నాయి. మొన్నటి వరకు ఏలూరు జిల్లా ఏజెన్సీని వణికించిన పెద్దపులి ఇప్పుడు తూర్పు గోదావరిలోకి ప్రవేశించింది. నిన్న రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడులో పశువులపై దాడి చేసి చంపేసింది. పులి దాడిపై స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు మీడియా సమావేశం నిర్వహిస్తుండగా.. వారి వెనకాలే పులి కనిపించింది. పులి సంచారం నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు రాజమండ్రి రూరల్, కోరుకుంట్ల, సీతానగరం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. పిల్లల్ని బయటకు వెళ్లనీయకుండా జాగ్రత్త తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించింది. ఇక నెల్లూరు జిల్లా దత్తలూరు మండలం నందిపాడులోనూ పెద్దపులి కలకలం సృష్టిస్తోంది. రేమానుకుంట వద్ద స్థానికులకు పెద్దపులి కనిపించింది. దీంతో ఉదయగిరి పరిసర ప్రాంతాలవారు భయాందోళనలో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో పెద్దపులి సంచారం.. జనాలతో పాటు ఫారెస్ట్ అధికారుల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. 15 రోజులుగా ఫారెస్ట్ అధికారులు పెద్దపులిని పట్టుకోవటానికి ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ లాభం లేకుండా పోయింది. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి ఆ పెద్దపులి వచ్చినట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఈ పెద్దపులి యాదాద్రి భువనగిరితో పాటు సిద్ధిపేట జిల్లా సరిహద్దులోనూ సంచరిస్తోంది. ఇక హైదరాబాద్ శివారు ప్రాంతంలోనూ ఓ పెద్దపులి తిరుగుతున్నట్లు సమాచారం.

## అడ్డంగా సంపాదించి..అధికార దుర్వినియోగం చేసి
# వేలకోట్లు కూడాబెడితే ప్రశ్నించవద్దా

హైదరాబాద్: తెలంగాణలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబం అనుభవించి, అక్రమంగా సంపాదించిందని సిఎం రేంవత్ రెడ్డి అన్నారు. వందల ఎకరాల ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల వ్యాపారాలు మీకెలా వచ్చాయి..? బీఆర్ఎస్ నేతలు చేయాల్సిన తప్పులన్నీ చేశారు. నేరాలు చేస్తాం.. ప్రశ్నించవద్దని మీరెలా అంటారు? అక్రమ మార్గాలు ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా విచారణ తప్పదని సీఎం స్పష్టం చేశారు. రావినారాయణ రెడ్డి స్మారక కార్యక్రమంలో సిఎం మాట్లాడారు. రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో తాము పనిచేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రావి నారాయణరెడ్డి పురస్కారాన్ని జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సీఎం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. నిజాం పాలకులకు వ్యతిరేకంగా రావి నారాయణరెడ్డి పోరాటం చేశారు. నాడు ప్రజల కష్టాలు, రాచరిక పోకడలు, అరాచక చర్యలపై పోరాడారు. 500 ఎకరాల భూమిని పేదలకు పంచి ఆదర్శంగా నిలిచారు. స్వేచ్ఛను హరించి, హక్కులకు భంగం కలిగిస్తే తిరుగుబాటు వస్తుంది. ప్రజల తిరుగుబాటు సాయుధ పోరాటంగా మారుతుందని ఆయన చాటి చెప్పారు. 60 ఏళ్లు వచ్చేసరికి రాజకీయ పదవీ విరమణ చేసిన గొప్ప నాయకుడు రావి నారాయణరెడ్డి. ప్రజల నుంచి తిరస్కారం పొందినా.. నేటి నేతలకు పదవీ వ్యామోహం పోవడం లేదు. రావి నారాయణ రెడ్డి నేషనల్ అవార్డు పొందడం ఎంతో గొప్పదిగా భావిస్తానని అవార్డు గ్రహీత జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. రావి నారాయణ రెడ్డి నిత్య చైతన్య స్ఫూర్తి అని కొనియాడారు. సొంత ఆస్తులను ప్రజలకు పంచిన మహానుభావుడని ప్రశంసించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై కవిత కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ట్యాపింగ్ వ్యవహారంలో విచారణను తొందరగా ముగించి దోషులకు శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సిట్ విచారిస్తున్న విషయం తెలిసిందే. ఈ కేసులో అధికారులకు సహకరించేందుకు తాను సిద్ధమని చెప్పారు. అధికారులు పిలిస్తే తాను విచారణకు హాజరవుతానని కవిత తెలిపారు. ఈ మేరకు ఈ రోజు ఉదయం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ మొదలై రెండు సంవత్సరాలు గడించిందని గుర్తుచేశారు. విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు గుప్పించారు. విచారణ ఇంకెప్పుడు ముగుస్తుందని, దోషులను ఎప్పుడు శిక్షిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిట్ విచారణలో ఏం జరిగిందనే వివరాలను కేసీఆర్ బయటపెడతారని భావిస్తున్నట్లు ఆమె చెప్పారు. కేసు విచారణనే తప్పుబడుతున్నట్లు కేటీఆర్ మాట్లాడటం సరికాదని కవిత అభిప్రాయపడ్డారు. చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత, అధికారులకు సహకరించాల్సిన విధి ప్రతీ పౌరుడిపైనా ఉందని వ్యాఖ్యానించారు. గుంట నక్కలతో కలిసి డ్రామాలాడుతోందంటూ కాంగ్రెస్ పార్టీపై ఆమె మండిపడ్డారు. తన ఫోన్ ను, తన భర్త ఫోన్ ను ట్యాప్ చేశారనే అనుమానిస్తున్నట్లు చెప్పిన కవిత.. సిట్ విచారణకు అధికారులు పిలిస్తే వెళతానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంలో ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగలింది. సామాజిక మాధ్యమాల పోస్టులపై రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా కేసులు పెట్టడం ఏ మాత్రం చెల్లదంటూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పీల్‌ను అత్యున్నత ధర్మాసనం తిరస్కరించింది. సోషల్ మీడియా పోస్టులపై అక్రమ కేసులు పెట్టడం ఏమాత్రం చెల్లదని గత ఏడాది సెప్టెంబర్‌లో హైకోర్టు సంచలన తీర్పును ఇచ్చింది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులతో పాటు చట్టాల స్ఫూర్తితోనే పోలీసులు పని చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు అప్రజాస్వామిక పద్ధతులతో సోషల్ మీడియా యాక్టివిస్టులను అణచివేయాలని చూస్తున్న ప్రభుత్వానికి ఒక హెచ్చరికగా మారింది. ఒక ట్వీట్ చేసినందుకు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినందుకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా పోస్టులు చేసినందుకు కేసులు పెడతామంటే చెల్లదని, కేసులు పెట్టే ప్రతి వ్యక్తి ఏ విధంగా తనకు వ్యక్తిగతంగా నష్టం జరిగిందో చెప్పాల్సిన అవసరం బాధ్యత ఉంటుందని అప్పుడే ఎఫ్ఐఆర్ లు నమోదు చేయాలని కఠినమైన ఆదేశాలను మార్గదర్శకాలను జారీ చేసింది. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా చేసిన పోస్టుల వలన మనోభావాలు దెబ్బతిన్నాయి, సామాజిక సమతుల్యత దెబ్బతింటుంది అంటూ అసత్యపు పునాదుల పైన అక్రమ కేసులు ఇప్పటిదాకా పెట్టిన ప్రభుత్వానికి ఈ తీర్పు ఒక గట్టి ఎదురు దెబ్బ అని చెప్పవచ్చు. హైకోర్టు తన తీర్పులో ఇచ్చిన మార్గదర్శకాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు ఫిర్యాదుదారుడు స్వయంగా బాధితుడా కాదా అనేది నిర్ధారించుకోవాలి, మూడవ పక్షం చేసే ఫిర్యాదులు పరువు నష్టం కేసులలో చెల్లవు. ప్రాథమిక విచారణ లేకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయకూడదు. అంతేకాకుండా, కేవలం రాజకీయ విమర్శలు లేదా కఠినమైన వ్యాఖ్యలను నేరంగా పరిగణించకూడదు. హింసను ప్రేరేపిస్తేనే అలాంటి కేసులు నమోదు చేయాలి. పరువు నష్టం అనేది నాన్`కాగ్నిజబుల్ నేరం కాబట్టి, నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా, ఫిర్యాదుదారుడు మేజిస్ట్రేట్ను సంప్రదించాలని హైకోర్టు సూచించింది. చివరగా, పోలీసులు అరెస్టు చేసేటప్పుడు ఆర్నేష్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, రాజకీయ ప్రేరేపితమైన లేదా నిరాధారమైన ఫిర్యాదులను తిరస్కరించాలని ఆదేశించింది.

## ఇప్పుడు రేవంత్ రెడ్డికి సమాచారం ఎలా వస్తుందో,
# నాడు కేసీఆర్‌కు అలాగే వచ్చింది: కేటీఆర్

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం తమకు లేదని, ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమాచారం ఎలా వస్తుందో, నాడు కేసీఆర్ ప్రభుత్వానికి కూడా అలాగే వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ నిన్న రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాలలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కదిలారని అన్నారు. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే మళ్లీ ఉద్యమ రోజులు గుర్తుకువస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో పాలనా వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని, మేడారం జాతర ఏర్పాట్లలో కూడా ప్రభుత్వం విఫలమైందని అన్నారు. దావోస్ ఒప్పందాల ద్వారా వచ్చిన పెట్టుబడులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో వారు చెబుతున్న అబద్ధాలు ఒక్కటొక్కటి తేలిపోతున్నాయని అన్నారు. మొదట వ్యాపారవేత్తలు, ఆ తర్వాత సినిమా తారల ఫోన్లు ట్యాప్ చేశారని చెప్పారని, ఇప్పుడు ఏమీ లేదని అంటున్నారని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన ఖర్మ తమకు లేదని స్వయంగా కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇకనైనా పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సజ్జనార్ తీర్పు చెప్పడానికి ఆయన జడ్జి కాదని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో వచ్చిన అభియోగాలపై కోర్టులు తేల్చుతాయని అన్నారు. హైదరాబాద్ నగరంలోపట్టపగలు కాల్పులు, దోపిడీ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సహజ వనరుల దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. సింగరేణి కుంభకోణం అంశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పష్టమైన సమాధానం రాలేదన్నారు. బొగ్గు కుంభకోణంపై సిట్టింగ్ జడ్జి, సీబీఐ విచారణ కోరుతుంటే ఎందుకు వెనక్కి పోతున్నారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో సృజన్ రెడ్డి కాల్ డేటా తీస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ నిలదీస్తోందని, అందుకే సిట్‌ల పేరిట విచారణలు చేస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. పైశాచిక ఆనందం కోసం కేసీఆర్‌ను అంతసేపు విచారణ పేరుతో కూర్చోబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌పై కేటీఆర్ పెదవి విరిచారు. ఉపాధి హామీని కుదించారని, ఎరువులు, ఆహార రాయితీ, స్వచ్ఛ భారత్ నిధులు తగ్గించారని ఆరోపించారు.

## ఏపీ, తెలంగాణలకు హైస్పీడ్ రైళ్లు గేమ్ ఛేంజర్..
## బెంగళూరుకు 2 గంటల్లో చేరుకోవచ్చు


అమరావతి : హైస్పీడ్ రైళ్లు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో పరుగు పెడతాయని, హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. హైస్పీడ్ కారిడార్‌తో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,454 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ హైస్పీడ్ రైళ్లు ఉభయ తెలుగు రాష్ట్రాలకు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) గేమ్ ఛేంజర్‌గా మారతాయని వెల్లడించారు. హైదరాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరుకు 3 హైస్పీడ్ రైళ్లు రానున్నాయని, దీంతో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని అన్నారు. పుణేకు గంట 55 నిమిషాలు, చెన్నైకి 2 గంటల 55 నిమిషాల్లో చేరుకోవచ్చని అన్నారు.

## శబరిమలలో మరో వివాదం...
# నిబంధనలు ఉల్లంఘించి సినిమా షూటింగ్!



ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమలలో మరో వివాదం రాజుకుంది. ఇప్పటికే బంగారం చోరీ కేసు ఆరోపణలతో వార్తల్లో ఉన్న ఈ ఆలయంలో, ఇప్పుడు నిబంధనలకు విరుద్ధంగా సినిమా షూటింగ్ జరిపినట్లు దేవస్వం విజిలెన్స్ విచారణలో వెల్లడైంది. పవిత్ర సన్నిధానం పరిసరాల్లో ఆంక్షలు ఉల్లంఘించి చిత్రీకరణ జరిపినట్లు తేలడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దేవస్వం విజిలెన్స్ ఎస్పీ సునీల్ కుమార్ సమర్పించిన నివేదిక ప్రకారం, ఒక సినిమా చిత్రీకరణను పంపానది పరిసరాలతో పాటు ఇతర ప్రాంతాల్లో పలు రోజుల పాటు నిర్వహించారు. అత్యంత పవిత్రమైన మకరవిళక్కు రోజున సైతం శబరిమల ఆలయ సముదాయానికి సమీపంలోని ఒక కొండపై చిత్రీకరణ జరిపినట్లు నివేదిక స్పష్టం చేసింది. అయితే, సన్నిధానంలో ఎలాంటి షూటింగ్ జరపలేదని చిత్ర దర్శకుడు అనురాజ్ మనోహర్ గతంలో చేసిన వాదనలను ఈ నివేదిక తోసిపుచ్చింది. ఈ ఘటనపై ఇప్పటికే దర్శకుడిపై కేసు నమోదైంది. అయితే, ఆంక్షలు ఉన్న ప్రాంతాల్లో చిత్రీకరణ జరిగినప్పటికీ, దీనికి పోలీసుల నుంచి ఎలాంటి అనుమతి పొందినట్లు విజిలెన్స్ నివేదికలో ప్రస్తావన లేకపోవడం గమనార్హం. షూటింగ్‌కు సంబంధించిన వీడియో ఆధారాలతో కూడిన ఈ నివేదికను ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) అధ్యక్షుడు కె. జయకుమార్‌కు అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా తదుపరి చర్యల కోసం బోర్డు న్యాయ నిపుణుల సలహాను కోరింది. చిత్రీకరణ సమయంలో జరిగిన ఉల్లంఘనలను గుర్తించి, సమగ్ర నివేదిక ఇవ్వాలని న్యాయ విభాగాన్ని అధ్యక్షుడు ఆదేశించారు. న్యాయసలహా అందిన తర్వాతే బాధ్యులపై పరిపాలనాపరమైన లేదా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మండలమకరవిళక్కు యాత్ర సమయంలో భక్తుల రద్దీ, ఆలయ పవిత్రత దృష్ట్యా కఠినమైన నియమాలు అమల్లో ఉండగా ఈ ఘటన జరగడం వివాదాన్ని మరింత పెంచింది.

## మోదీకి ట్రంప్ ఫోన్ కాల్..
## "స్టే ట్యూన్డ్" అంటూ అమెరికా రాయబారి పోస్ట్!



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మధ్య సోమవారం ఫోన్ సంభాషణ జరిగింది. ఈ విషయాన్ని భారత్‌లో అమెరికా రాయబారి సెర్జియో గోర్ తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. "అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడే ప్రధాని మోదీతో మాట్లాడారు. స్టే ట్యూన్డ్..." అని ఆయన పోస్ట్ చేయడంతో ఈ సంభాషణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. భారత్, అమెరికా మధ్య కీలకమైన వాణిజ్య ఒప్పంద చర్చలు జరుగుతున్న తరుణంలో ఈ ఫోన్ కాల్ జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. భారత ఎగుమతులపై ట్రంప్ ప్రభుత్వం 50 శాతం వరకు భారీ సుంకాలు విధించడంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాల్లో కొంతకాలంగా అనిశ్చితి నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇద్దరు అగ్రనేతల మధ్య ఏం చర్చ జరిగి ఉంటుందనే దానిపై ఉత్కంఠ పెరిగింది. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మూడు రోజుల పర్యటన కోసం వాషింగ్టన్ వెళ్లిన రోజే ఈ సంభాషణ జరగడం గమనార్హం. ఈ పరిణామం రెండు దేశాల మధ్య దౌత్య, వాణిజ్య బంధాలను బలోపేతం చేసే ప్రయత్నాల్లో భాగంగా కనిపిస్తోంది. అయితే, ఇద్దరు నేతల మధ్య ఏయే అంశాలు చర్చకు వచ్చాయనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ సంభాషణపై భారత ప్రభుత్వం నుంచి కూడా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. 'స్టే ట్యూన్డ్' అని రాయబారి సూచించిన నేపథ్యంలో, వాణిజ్య ఒప్పందం లేదా ఇతర కీలక అంశాలపై త్వరలోనే ప్రకటన వెలువడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైకాపా

అమరావతి: రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైకాపా కుట్రలు పన్నుతోందని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు అన్నారు. అధికారం కోల్పోయామనే అసహనంతోనే రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోందని.. అలజడి సృష్టించేందుకే ఆ పార్టీ నేతలు బూతులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో సీఎం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. హింస, విధ్వంసం, అవినీతి పునాదులపై వైకాపా పుట్టింది. ఆ పార్టీ ట్రాప్‌లో పడితే వారికీ.. మనకీ తేడా ఉండదని చంద్రబాబు అన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైకాపా అడ్డంగా దొరికిపోయింది. రాష్ట్ర ప్రజలంతా ఆ పార్టీని చీదరించుకుంటున్నారు. చేసిన పాపాలను దారిమళ్లించాలనేది వైకాపా కుట్ర. పెట్టుబడులు సాధించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే మన ప్రధాన అజెండా. అది వైకాపా నేతలకు నచ్చడం లేదు. అందుకే అడ్డుకునేందుకు కుట్రలకు పాల్పడుతున్నారు. తప్పు చేసిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతాం. తెదేపా కార్యకర్తలు సంయమనం పాటించేలా మంత్రులు, నేతలు బాధ్యత తీసుకోవాలి. కార్యకర్తలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వైకాపా ట్రాప్‌లో పడొద్దు. అలా జరగకుండా పార్టీ నేతలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇకపోతే రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న తాజా పరిణామాలు, శాంతిభద్రతల అంశం, పాలనలో మార్పులు వంటి విషయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన తాజా ట్వీట్ చర్చకు దారితీసింది. వైసీపీపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్ర పునర్నిర్మాణాన్ని జీర్ణించుకోలేక వైసీపీలో ఫ్రస్టేషన్ పెరిగిందని చంద్రబాబు విమర్శించారు. రాజకీయాలను నేరమయం చేయడమే వైసీపీ సిద్ధాంతమని, వారి పాలనలో చట్టవిరుద్ధ పాలనకు అనేక ఉదాహరణలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. జగన్ హయాంలో చట్టాన్ని పక్కనపెట్టి, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన అనేక అక్రమాలు, చట్టవిరుద్ధ చర్యలే దీనికి నిదర్శనమని ప్రస్తావించారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ జగన్ పాలన కొనసాగిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు తన ట్వీట్‌లో రూల్ ఆఫ్ లా గురించి ప్రధానంగా ప్రస్తావించారు. 2024 తర్వాతే రాష్ట్రంలో నిజమైన చట్టపాలన అమలవుతోందని స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో చట్టం పేరుకే ఉండేదని అధికారమే అన్నింటికీ ఆధారంగా మారిందని విమర్శించారు. ప్రజలకు న్యాయం అందాలంటే రాజ్యాంగమే సుప్రీమ్‌గా ఉండాలని, అదే తమ ప్రభుత్వ విధానమని చంద్రబాబు స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే అధికారం ఎవరికీ లేదని, అది ఏ పార్టీకి చెందిన వారైనా సరే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

* బిఆర్ఎస్ నాయకులపై మండిపడ్డ కాంగ్రెస్ శ్రేణులు

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న కుట్రలను నిరసిస్తూ, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఏళ్ల బాల్ రెడ్డి మాట్లాడుతూ.. బిఆర్ఎస్ నాయకులు



తమ చిల్లర రాజకీయాలను మానుకోవాలని హితవు పలికారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అరాచకాలు ఒక్కొక్కటిగా బయటపడుతుండటంతో భయం పట్టుకున్న బిఆర్ఎస్ నేతలు, రాజ్యాంగబద్ధంగా జరుగుతున్న విచారణలను అడ్డుకోవాలని చూడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా ఎందరో జీవితాలతో చెలగాటమాడి, వ్యాపారులను బెదిరించి పార్టీ నిధులు వసూలు చేసిన చరిత్ర మీది కాదా? అని ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక బురదజల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజా సంక్షేమ పథకాలను గడపగడపకు చేరుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇబ్బంది పెట్టాలని చూస్తే కాంగ్రెస్ కార్యకర్తలు తగిన బుద్ధి చెబుతారని "ఖబడ్దార్" అంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, జిల్లా నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మండల నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్ యు ఐ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మానవతాలు చాటుకున్న మియాపూర్ సీఐ శివప్రసాద్


* తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు




శేర్లింగంపల్లి , ప్రజాస్ఫూర్తి : మియాపూర్ న్యూ కాలనీకి చెందిన రాజేష్ కుమారుడు 5 సంవత్సరాల సిద్ధార్థ్ సోమవారం ఉదయం ఇంటి బయట ఆడుకుంటూ ఒక కిలోమీటర్ దూరం వెళ్లి తప్పిపోయాడు. వెంటనే స్పందించిన పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయములు మియాపూర్ పోలీసులు బాలుడిని గుర్తించి రెండు గంటల పాటు శ్రమించి తల్లిదండ్రుల అడ్రస్ కనుక్కొని ఆ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బాలుడి ఆచూకీ కోసం పోలీసులకు ఫిర్యాదు చేద్దామనుకున్న నేపథ్యంలో పోలీసులే ముందస్తుగా తమ బాబును గుర్తించి అప్పజెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. పసివాడిని క్షేమంగా అప్పజెప్పడంపై తల్లిదండ్రులు ఆనందానికి హద్దులు లేవు. పసి బాలుడిని వారికి అప్పజెప్పిన మియాపూర్ సిఐ శివప్రసాద్ కి , కానిస్టేబుల్ కు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మార్పీకి ధరల కంటే ఎక్కువ రేటుకు మద్యం అమ్మకాలు!

* జూలూరుపాడు–అన్నపురెడ్డిపల్లి లో వైన్ షాపుల దందా



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లి మండలాలలోని పలు వైన్ షాపుల యజమానులు ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా మద్యం విక్రయిస్తూ మందుబాబులను నిలువునా దోచుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పేరు ఉన్న బ్రాండ్‌ల మద్యం వైన్ షాపుల్లో లభించకుండా ఉద్దేశపూర్వకంగా బెల్ట్ షాపులకు తరలించి అక్కడ అధిక ధరలకు విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమాలపై పలు పత్రికలలో వార్తలు ప్రచురితమైనప్పటికీ, ఇప్పటివరకు ఎక్సైజ్ శాఖ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధిక ధరల మద్యం విక్రయాల వల్ల సామాన్య వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయని, వెంటనే ఈ అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించేలా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంలో ఎక్సైజ్ శాఖ వెంటనే స్పందించకపోతే, తగిన ఆధారాలతో ఎక్సైజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తెల్లం నరసింహారావు దొర హెచ్చరించారు.

## ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



శంకర్‌పల్లి, ప్రజాస్ఫూర్తి : శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో గల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయ ఆవరణలో సోమవారం సిద్ధార్థ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరం ఉదయం గం. 9 నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు నిర్వహించారు. ఈ క్యాంపులో జనరల్ మెడిసిన్, ఈఎన్ టి, గైనిక్, ఆర్థోపెడిక్ డాక్టర్ లు సుజిత సిద్ధార్థ రెడ్డి, అజయ్ కుమార్, హిమసింధు, అర్షియా షేక్, కృష్ణప్రసాద్, జిఆర్ బిఎస్, బిపి, బరువు, రక్త పరీక్షలతో పాటు పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామంలో ఉన్న ప్రజలతో పాటు, పక్క గ్రామాల వాసులు 125 మందికి పరీక్షలు నిర్వహించి, టెస్టులతో పాటు మందులు ఉచితంగా అందజేశారు. మేనేజర్ భీమయ్య హెల్త్ క్యాంపు జయప్రదానికి కృషి చేశారు.

## తెలంగాణ సాధించిన కేసీఆర్ కూడా జాతిపితనే: హరీశ్‌రావు



హైదరాబాద్: హార్వర్డ్‌లో చదువుకున్నా సీఎం రేవంత్‌రెడ్డి గుణం మార్చుకోలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. రావి నారాయణరెడ్డి పురస్కార ప్రదాన కార్యక్రమంలో సీఎం చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు స్పందించారు. హేట్ స్పీచ్ గురించి పుస్తకాలు అక్కర్లేదని, సీఎం ప్రసంగాలు వింటే చాలని అన్నారు. "కేసీఆర్‌పై తన అజీర్తిని, అక్కసును సీఎం మరోసారి బయటపెట్టారు. దేశానికి గాంధీ జాతిపిత అయినట్లే.. తెలంగాణ సాధించిన కేసీఆర్ కూడా జాతిపితనే. ప్రశ్నిస్తే, నిలదీస్తే, అరెస్టులు, కేసులతో అధికారంలో ఉన్న నాయకులు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. రేవంత్‌రెడ్డికి ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే హక్కు ఉందా" అని హరీశ్‌రావు ప్రశ్నించారు.



## విద్యతోనే సమాజంలో సరైన గుర్తింపు..

* మండల విద్యాధికారి రంజిత్ కుమార్
* వట్ పల్లి లో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ పోస్టర్ ఆవిష్కరణ

అందోలు, ప్రజాస్ఫూర్తి: చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం లభిస్తాయని మండల విద్యాధికారి రంజిత్ కుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన 'మిషన్ 10వ తరగతి' ప్రోగ్రాం పోస్టర్‌ను సోమవారం వట్ పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి,వారిని చదువుపై మరింత శ్రద్ధ పెట్టేలా ప్రోత్సహించి మరియు వారి లక్ష్యాలను సాధించే దిశగా మార్గనిర్దేశం చేసే ఒక గొప్ప కార్యక్రమం అన్నారు. ఈ మిషన్ ద్వారా పదవ తరగతిలో స్టేట్ వైడ్ మొత్తం రూ.2.2 కోట్ల క్యాష్ ప్రైజెస్ అందజేయనున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా ఫస్ట్ ప్లేస్ సాధించిన స్టూడెంట్‌కు రూ.5 లక్షలు, సెకండ్ ప్లేస్ వారికి రూ.3 లక్షలు, ప్రతి జిల్లా టాపర్‌కు రూ.2 లక్షలు, నియోజకవర్గ టాపర్లకు రూ.1 లక్ష చొప్పున, మండల టాపర్లకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు లభిస్తాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ రవీందర్, ప్రవీణ్ గౌడ్, ఉపాధ్యాయులు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ అసిస్టెంట్ మేనేజర్ రాజు, ఏజెంట్లు నరేందర్ గౌడ్, యాదయ్య తో పాటు పలువురు పాల్గొన్నారు.



## రామవరం అభివృద్ధికి కొత్త ప్రతిపాదన

* సింగరేణికి కమ్యూనిటీ కమర్షియల్–బ్యాంకింగ్ హబ్ విన్నపం

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రామవరం ప్రాంత అభివృద్ధికి కీలకమైన ప్రతిపాదన ముందుకు వచ్చింది. రామవరం కేంద్రంగా కమ్యూనిటీ కమర్షియల్ అండ్ బ్యాంకింగ్ హబ్ ఏర్పాటు చేయాలని 15వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి ఆకునూరి సుప్రియ సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. రామవరం ప్రాంతంలో సింగరేణి కార్మికులు, విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ తగిన బ్యాంకింగ్ సదుపాయాలు, క్రమబద్ధీకరించిన మార్కెట్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి సింగరేణికి చెందిన ఖాళీ భూముల్లో ఆధునిక వాణిజ్య సముదాయాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలో భాగంగా పెన్షనర్లు, మహిళలు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రామవరంలోనే పూర్తిస్థాయి బ్యాంకు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే స్వయం సహాయక సంఘాలు, స్థానిక రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు ప్రత్యేక షాపింగ్ జోన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. మార్కెట్ ప్రాంతంలో మహిళా కార్మికుల సౌకర్యార్థం ఆధునిక మరుగుదొడ్ల నిర్మాణం చేయాలని, ఈ ప్రాజెక్టు ద్వారా సింగరేణికి అద్దెల రూపంలో ఆదాయం లభించడంతో పాటు భూములు అక్రమ ఆక్రమణల నుంచి రక్షణ పొందుతాయని వివరించారు. అంతేకాకుండా వందలాది మంది స్థానిక యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును రామవరం మార్కెట్ కమిటీ సహకారంతో పారదర్శకంగా అమలు చేయవచ్చని సూచించారు. సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందిస్తే రామవరం ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.




## జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

* పకడ్బందీగా నిర్వహణ : డీఐఈవో వెంకటేశ్వరరావు

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను పారదర్శకంగా, క్రమశిక్షణతో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఉదయం సెషన్‌లో జనరల్ కోర్సులో 974 మందికి గాను 948 మంది హాజరుకాగా, వొకేషనల్ కోర్సులో 1,381 మందికి గాను 1,324 మంది పరీక్షలు రాశారు. మొత్తం 2,365 మందికి 2,182 మంది హాజరై 83 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో జనరల్ కోర్సులో 703 మందికి 685 మంది, వొకేషనల్ కోర్సులో 1,362 మందికి 1,296 మంది హాజరయ్యారు. మొత్తం 2,065 మందిలో 1,982 మంది పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు.ప్రాక్టికల్ పరీక్షల ప్రారంభ సందర్భంగా డీఐఈవో వెంకటేశ్వరరావు మణుగూరు, ఎడులబయ్యారం, భద్రాచలం ప్రాంతాల్లోని కళాశాలలను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ల్యాబ్ సదుపాయాలు, హాజరు నమోదు, ప్రశ్నపత్రాల గోప్యత తదితర అంశాలను పరిశీలించి, ప్రభుత్వ మరియు ఇంటర్మీడియట్ బోర్డు మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని కళాశాల యాజమాన్యాలకు సూచించారు. మిగిలిన రోజుల్లో కూడా ప్రాక్టికల్ పరీక్షలను శాంతియుతంగా, సమర్థవంతంగా నిర్వహిస్తామని వెంకటేశ్వరరావు తెలిపారు.

## జ్ఞాన సమాజ నిర్మాణంలో స్వేరో నెట్వర్క్ పాత్ర అభినందనీయం

* సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వేరో నెట్వర్క్ 2026 నూతన క్యాలెండర్‌ను సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల విద్యార్థులను తీర్చిదిద్ది, వారిని ఎవరెస్టు శిఖరాల వరకు చేరవేసిన గొప్ప నాయకుడు డాక్టర్ ఆర్. ఎస్. ప్రవీణ్ కుమార్ అని కొనియాడారు. అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం అనే లక్ష్యాలతో పనిచేస్తున్న స్వేరో నెట్వర్క్, భవిష్యత్తులో జ్ఞాన సమాజాన్ని నిర్మించడంలో మరెన్నో మంచి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్వేరో జిల్లా అధ్యక్షులు బట్టు శ్రీకాంత్, వార్డు సభ్యులు శీలం పద్మ వెంకటేష్, మరియు నాయకులు మాదూరి శివ తదితరులు పాల్గొన్నారు. స్వేరో నెట్వర్క్ చేస్తున్న సామాజిక సేవలను ఈ సందర్భంగా పలువురు ప్రశంసించారు.

## పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన, ఎప్పటికప్పుడు పరిశుభ్రతను పాటించాలని అధికారులకు సూచించారు. 5ఎస్ అమలులో భాగంగా పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలన్నారు.అనంతరం పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించిన ఎస్పీ, పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్టికల్స్ వారీగా విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. డయల్-100కు ఫోన్ వచ్చిన వెంటనే స్పందించి ఘటనాస్థలానికి చేరుకుని బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు తగ్గించే దిశగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్న ఎస్పీ, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ సీఐ సతీష్, ఎస్సై శ్రీనివాస్, టీజీఎస్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పొగ మంచు తో వాహనదారులు ఇక్కట్లు



వికరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : వికారాబాద్ పరిధిలోని అనంతగిరి పరిసర ప్రాంతాలలో ఉదయం మంచు అల్లాధకరంగా కురవడం జరిగింది ఉదయం 8:30 గంటల వరకు సూర్యుడు మబ్బుల చాటున ఉండడం జరిగింది పొగ మంచు కారణంగా ప్రయాణికులు వాహనాలలో ఇబ్బందికరంగా ప్రయాణాలు కొనసాగించారు విపరీతమైన పొగ మంచు కారణంగా ముందు వెళ్తున్న వాహనాలు కనబడకపోవడంతో ప్రయాణికులు ఇక్కట్లు పడ్డారు.

# సమీకృత వ్యవసాయం రైతులకు స్థిర ఆదాయ మార్గం

*** జిల్లా కలెక్టర్ జి.వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రైతులకు స్థిరమైన, నిరంతర ఆదాయం కోసం సమీకృత వ్యవసాయ విధానం ఉత్తమ మార్గమని జిల్లా కలెక్టర్ జి.వి. పాటిల్ అన్నారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు గ్రామంలో రైతు పి. ప్రశాంత్ ఏర్పాటు చేసిన సమీకృత వ్యవసాయ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా ఆకుకూరలు, మునగ, పండ్ల సాగుతో పాటు చేపలు, మేకలు, బ్యాక్‌యార్డ్ మదర్ యూనిట్, డక్స్ యూనిట్ల నిర్వహణను పరిశీలించి ప్రశంసించారు. ఈ తరహా యూనిట్లు ఇతర రైతులకు ఆదర్శమని తెలిపారు. అనంతరం మైలవరం గ్రామంలో రైతు ఎం. కృష్ణవేణి ఏర్పాటు చేసిన కౌజు పిట్టల యూనిట్‌ను పరిశీలించి, తక్కువ పెట్టుబడితో ఉపాధి కల్పన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. జిల్లాలో 500 కౌజు పిట్టల యూనిట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.మైలవరం గ్రామ యువ రైతు కె. సందీప్ అమలు చేస్తున్న సేంద్రియ వ్యవసాయ విధానాన్ని పరిశీలించి అభినందించారు. సేంద్రియ సాగుతో ఖర్చులు తగ్గి దీర్ఘకాలిక లాభాలు సాధ్యమవుతాయని తెలిపారు. యువ రైతులకు అవగాహన కల్పించేందుకు సుజాతనగర్‌లోని రవి హైబ్రిడ్ సీడ్స్ కేంద్రం సందర్శనకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకయ్య, సంబంధిత అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# కేంద్రం వైఖరిపై కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన గట్టి పోరాటం చేస్తుంది

*** తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి**



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : కేంద్రం వైఖరిపై కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన గట్టి పోరాటం చేస్తుందని తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్-2026 తెలంగాణ ప్రజల ఆశలపై మరోసారి నీళ్లు చల్లిందని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కోసం ₹1.5 లక్షల కోట్ల సహాయం కోరితే, కేంద్రం మాత్రం రూపాయి కూడా ఇవ్వకుండా తెలంగాణను పూర్తిగా విస్మరించిందని ఆమె మండిపడ్డారు."తెలంగాణ దేశ ఖజానాకు వెన్నెముకలా నిలుస్తోంది. కానీ హక్కుగా రావాల్సిన నిధులను కేంద్రం ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోంది. ఇది ఆర్థిక నిర్ణయం కాదు - రాజకీయ కక్ష" అని ఆమె పేర్కొన్నారు. కేంద్రం ఈసారి కూడా తెలంగాణకు సంబంధించిన కీలక ప్రాజెక్టులను పక్కన పెట్టిందని ఆమె వివరించారు. తెలంగాణ యువత ఉద్యోగాలు, పట్టణాల అభివృద్ధి, గ్రామాల మౌలిక సదుపాయాలతో ముడిపడి ఉన్నాయి. వాటిని విస్మరించడం అంటే తెలంగాణ భవిష్యత్తును తాకట్టు పెట్టడమే" అని ఆమె అన్నారు తెలంగాణ దేశానికి వేల కోట్ల పన్నులు చెల్లిస్తుంటే, కేంద్రం తిరిగి ఇస్తోంది మాత్రం వివక్ష మాత్రమేనని డా. రేఖ వ్యాఖ్యానించారు."బీజేపీ ప్రభుత్వానికి తెలంగాణ ఓటు బ్యాంకుగా కావాలి... కానీ అభివృద్ధి మాత్రం అవసరం లేదనుకుంటోంది. ఇదే ఈ బడ్జెట్ సారాంశం" అని ఆమె విమర్శించారు.తెలంగాణ ప్రజలు కోరింది భిక్ష కాదని, రాజ్యాంగబద్ధమైన వాటా అని స్పష్టం చేశారు.

# ప్రభుత్వ నిర్ణయాలతో ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు

**: మంత్రి పొంగులేటి**



హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఒక్కో ఇటుక పేర్చుకుంటూ సంక్షోభం నుంచి గట్టెక్కుతూ.. అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం.. ప్రజల జీవితాలలో స్పష్టమైన మార్పునకు నాంది పలుకుతోందని చెప్పారు. వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన ఇలా అన్ని రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలుపుతున్నాయన్నారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆధునీకరించిన సమాచార పౌరసంబంధాల శాఖ వెబ్‌సైట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ మార్పులను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో ప్రజా సంబంధాల శాఖ పాత్ర అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకొని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు వేగవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సమాచార శాఖ అధికారులకు మంత్రి సూచించారు.

# సూపర్ మ్యాక్స్ పరిశ్రమలో జరిగిన దొంగతనంపై సమగ్ర విచారణ చేయాలి




జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో సూపర్ మ్యాక్స్ పరిశ్రమలో జరిగిన దొంగతనంపై సమగ్ర విచారణ చేసి అసలు నింధుతులను అరెస్ట్ చేయాలని కార్మిక నాయకులు అన్నారు. సూపర్ మాక్స్ కంపెనీ జేఏసీ , కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కంపెనీ గేటు ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు సిఐటియు ఎఐటియుసి ఐఎన్టియుసి బీఆర్ఎస్ కే వి , సంఘాల నాయకులు కీలుకాని లక్ష్మణ్. ఉమామహేష్ గుంజ శ్రీనివాస్. రవి సింగ్ లు పాల్గొని మాట్లాడుతూ జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో ప్రధాన రహదారి పక్కనున్న సూపర్ మ్యాక్స్ కంపెనీలో మిషనరీని గుట్టు చప్పుడు కాకుండా వారాలు వారాలు కంపెనీలో తిష్ట వేసి జీడిమెట్ల నుండి హిమాచల్ ప్రదేశ్ కు తరలించడం జరిగిందని తరలించే క్రమంలో లారీలు పెట్టింది ఎవరు మిషనరీ కి సంబంధించిన బిల్లులు జీడిమెట్లలో. ఏ కంపెనీ నుంచి చేశారు ఈ దొంగతనానికి సంబంధించి పూర్తిగా సహకరించి డబ్బులు ఖర్చు పెట్టి సహకరించిన పెద్దలు ఎవరు . తెలపవలసిన పోలీస్ అధికారులు మాత్రం జేఏసీ నాయకులు పోలీసు వాళ్ళని కలిసి దీని వెనకాల ఉన్నది ఎవరు అని అడిగితే మీకు చెప్పాల్సిన అవసరం లేదు మీరు మమ్మల్ని అడగవద్దు అని చెప్పడం జరుగుతుందన్నారు. ఒకపక్క కార్మికులేమో మూడు సంవత్సరాల నుండి పెండింగ్ జీతాలు రాక కంపెనీ నుండి రావాల్సిన బకాయిల గురించి జేఏసీగా ఏర్పడి కోర్టులో చుట్టూ అధికార పార్టీల నాయకుల చుట్టూ లేబర్ ఆఫీసులో చుట్టూ చెప్పులు. కాళ్లు అరిగేలాగా తిరిగిన కార్మికులకు రావలసిన బకాయిలు రాక లోను బకాయిలు చెల్లించలేక పిల్లల ఫీజులు కట్టలేక ఇంటి అద్దెలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులతో ఇప్పటికే కార్మికులు పదుల సంఖ్యలో గుండెపోటుతో మృతి చెందారని చనిపోయిన వాళ్ళ అంత్యక్రియలు కూడా చందాలు వేసుకొని చేయవలసి వస్తుందని నాయకులు వాపోయారు. ఇంత జరుగుతున్నా కార్మిక శాఖ అధికారులు గానీ అధికార పార్టీల ఎమ్మెల్యేలు మంత్రులు ఏమి చర్యలు తీసుకోవడం లేదని ఎన్నికల టైం లో అన్ని రాజకీయ పార్టీల నాయకులు మేము మీకు అండగా ఉన్నాం. మా ప్రభుత్వం రాగనే మీ సమస్యను పరిష్కారం చేస్తామని వాగ్దానాలు ఇచ్చారే తప్ప మూడు సంవత్సరాల నుండి సమస్యను పరిష్కారం చేయలేదని అన్నారు ఇప్పటికైనా లేబర్ అధికారులు ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని. సూపర్ మాక్స్ కార్మికులకు న్యాయం చేయాలని లేని పక్షంలో మేడ్చల్ జిల్లాలో ఉన్న అన్ని కార్మిక సంఘాల తో జేఏసీగా ఏర్పడి. సూపర్ మ్యాక్స్ కార్మికుల. సమస్య పరిష్కారం కోసం జీడిమెట్ల నుండి లేబర్ ఆఫీస్ అంజయ్య భవన్ వరకు వేల మందితో పాదయాత్ర చేస్తామని కార్మికులకు న్యాయం జరిగేలా ఐఆర్పీ నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ దొంగతనం వెనకాల పాత యాజమాన్యం మల్హోత్రా మీద కార్మికులకు అనుమానం ఉన్నదని వెంటనే సీఓసీ నుంచి పాత యాజమాన్యం మలహోత్రాను తొలగించాలని అన్నారు ఈ కార్యక్రమంలో సూపర్ మాక్స్ జేఏసీ నాయకులు .ఈశ్వర్ రావు లక్ష్మారెడ్డి.సురేష్, రవీందర్, శ్రీనివాస్ , మహిళా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆలకుంట్ల ఝాన్సీ రాణి నాగరత్నం రాజుకు చిగుర్ల లలిత సురేష్ మద్దతు

ప్రజా స్ఫూర్తి, నల్లగొండ: 18వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన చిగుర్ల లలిత సురేష్, తన నామినేషను ఉపసంహరించుకుని స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న అలకుంట్ల ఝాన్సీ రాణి నాగరత్నం రాజు దంపతులకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా అలకుంట్ల ఝాన్సీ రాణి నాగరత్నం రాజు మాట్లాడుతూ, తమపై విశ్వాసం ఉంచి మద్దతు ప్రకటించిన చిగుర్ల లలిత సురేష్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మద్దతు తమకు మరింత బలం, ఉత్సాహాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. అదే విధంగా చిగుర్ల లలిత సురేష్ మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధి కోసం నిజాయితీగా పనిచేసే నాయకత్వానికి ప్రజలు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో సింహం గుర్తుపై ఓటు వేసి అలకుంట్ల ఝాన్సీ రాణి నాగరత్నం రాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాలనీ వాసులను ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ పరిణామంతో 18వ డివిజన్లో ఎన్నికల పోరు మరింత ఉత్కంఠభరితంగా మారింది. ప్రజల మద్దతు పెరుగుతుండటంతో అలకుంట్ల ఝాన్సీ రాణి నాగరత్నం రాజు విజయం దిశగా అడుగులు వేస్తున్నారని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తన లక్ష్యం


*** ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తన లక్ష్యమని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రధాన రహదారి లోని ఇందిరాగాంధీ స్టేట్యూ వద్ద మంజీరా పైప్ లైన్ పగిలి నిత్యం రోడ్డుపైకి నీరు రావడంతో కాలనీ వాసులు మరియు వ్యాపారులు గత కొన్ని రోజులుగా ఇబ్బంది పడుతున్న సమస్యను పరిష్కరించే విధంగా 17.20 లక్షల రూపాయల నిధులతో నూతన పైప్ లైన్ ను నిర్మించేందుకు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జల మండలి అధికారులతో కలిసి కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ , జల మండలి అధికారుల సహకారంతో సమస్యను పరిష్కరించుకోవడం జరుగుతుందని అన్నారు. ఇంతకు ముందు ఉన్న పైప్ లైన్ పగలడంతో సమస్య ఏర్పడిందని, పైప్ లైన్ డివైడర్ కింద ఉండడంతో మరమ్మత్తు చేయడానికి వీలు లేకుండా పోయిందని, సుమారు నూటయాభై మీటర్లు నూతన పైప్ లైన్ ను నిర్మించి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని తెలియచేసారు. కార్యక్రమంలో నాయకులు గుడ్ల శ్రీనివాస్, గోపాల్, లింగం, రమేష్, నాగార్జున, వాటర్ వర్క్స్ మేనేజర్ ఝాన్సీ, వర్క్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్ శివ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధుల వివరాలు సేకరించండి..

## అధికారులకు ఎస్ఈసీ దిశానిర్దేశం



హైదరాబాద్: కార్పొరేషన్ మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికల కోసం ఎక్స్ అఫిషియో ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సూచించారు. మున్సిపల్ ఎన్నికలు జరగనున్న జిల్లాలకు సంబంధించి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ఎస్ఈసీ రాణికుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 16న జరగనున్న మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల పరోక్ష ఎన్నికపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్పొరేటర్లు, వార్డు కౌన్సిలర్లతో పాటు ఎక్స్ అఫిషియో సభ్యులకు ఓటు హక్కు ఉంటుందని కాబట్టి.. ఆ జాబితా సిద్ధం చేయాలన్నారు. "ఎక్స్అఫిషియో సభ్యులుగా ఇప్పటికే నమోదైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వివరాలు పంపించండి. ఈ నెల 11 నుంచి 14 వరకు కొత్తగా నమోదు చేసుకోవాల్సిన ప్రజాప్రతినిధుల వివరాలు సేకరించాలి. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలకు ఏదైనా ఒక మున్సిపాలిటీ/కార్పొరేషన్‌లో ఓటు వేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ నెల 14న పరోక్ష ఎన్నిక కోసం నోటిఫికేషన్ ఇస్తాం. 16న కార్పొరేటర్లు, కౌన్సిలర్ల ప్రమాణస్వీకారం తర్వాత ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్, మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక ఉంటుంది. సమావేశానికి కనీసం సగం మంది సభ్యులుంటే కోరంగా పరిగణించాలి. లేకపోతే మరుసటి రోజున నిర్వహించాలి. చేతులెత్తే విధానంలో ఓటింగ్ ఉంటుంది'' అని అధికారులకు ఎస్ఈసీ దిశానిర్దేశం చేశారు.

# శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో అమెరికా దేశస్థుల ప్రత్యేక పూజలు




శంకర్‌పల్లి ( ప్రజాస్ఫూర్తి ): శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో వెలిసిన 11వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో సోమవారం అమెరికా దేశస్తులు భారతీయ సంప్రదాయ వస్త్రాలు ధరించి స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఉసిరి చెట్టు వద్ద ఒత్తుల దీపాలు వెలిగించారు. భక్తులకు ముగ్గురు దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, అన్నదాన కమిటీ చైర్మన్ దర్శన్ గౌడ్ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాటు చేశారు.

# ఎన్నికల్లో పోటీ కోసం కన్న కూతుర్ని హత్య చేసిన తండ్రి



ఎడపల్లి: నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని నిజాం సాగర్ కెనాల్‌లో ఇటీవల జరిగిన బాలిక హత్య కేసులో విస్తుపోయే నిజాలు బయటబడ్డాయి. మృతురాలిని మహారాష్ట్రలోని ముఖేడ్ తాలూకా కేరూర్‌కు చెందిన ప్రాచి(6)గా గుర్తించారు. నిజామాబాద్ సీపీ సాయి చైతన్య వెల్లడించిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలో త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో కేరూర్ గ్రామ సర్పంచిగా పోటీ చేయాలని ప్రాచి తండ్రి పాండురంగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ముగ్గురు పిల్లలు ఉంటే పోటీకి అనర్హుడని భావించాడు. ప్రస్తుత సర్పంచి గణేశ్‌తో కలిసి తన పిల్లల్లో ఒకరిని హత్య చేసేందుకు కుట్ర పన్నాడు. పెద్ద కూతురు ప్రాచిని ఎడపల్లికి తీసుకొచ్చి కెనాల్‌లో తోసేశాడు. నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి బాలిక మృతి చెందింది. ఈ ఘటనలో పాండురంగతో పాటు కేరూర్ సర్పంచి గణేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిజామాబాద్ సీపీ తెలిపారు. కేసును చేధించిన పోలీసులను అభినందించారు.

# తాడిచర్ల1 బొగ్గు గనులను తెలంగాణకు కేటాయించాం: కిషన్‌రెడ్డి



దిల్లీ: తాడిచర్ల 1 బొగ్గు గనుల విషయంలో కేంద్రం స్పష్టత ఇచ్చింది. 2015 ఆగస్టు 31న తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థకు కేటాయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాజ్యసభలో వెల్లడించారు. 2019 మార్చిలో ఉన్నత స్థాయి కమిటీ నివేదిక ఆమోదం తర్వాత.. 2020 జూన్ నుంచి బొగ్గు గనుల కేటాయింపుల ప్రక్రియ మారిందని తెలిపారు. వ్యాపారపరమైన కార్యకలాపాలకు ఉపయోగించే గనులన్నింటినీ వేలం ద్వారానే కేటాయించాలని ఉన్నత స్థాయి కమిటీ కీలక సూచన చేసిందని చెప్పారు. ప్రత్యేక, తప్పని పరిస్థితిలోనే బొగ్గు మంత్రిత్వ శాఖ నేరుగా కేటాయించాలని ఉన్నత స్థాయి కమిటీ స్పష్టం చేసిందన్నారు. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు రాజ్యసభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తాడిచర్ల2 గనులు ఇంకా ఎవరికీ కేటాయించలేదని సమాధానంలో పేర్కొన్నారు.

# ఈసీతో వాడీవేడి సమావేశం.. మధ్యలోనే దీదీ వాకౌట్!

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వ్యవహారంలో ఎన్నికల సంఘం (EC) ఉన్నతాధికారులతో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సమావేశం వాడీవేడిగా సాగినట్లు తెలుస్తోంది. ఎస్ఐఆర్ విషయంలో లేవనెత్తిన అంశాలపై ఉన్నతాధికారుల సమాధానాలను వినకుండానే మమత కోపంగా వెళ్లిపోయారని ఈసీ అధికారులు తెలిపారు. ఎస్ఐఆర్ విషయంలో నిబంధనల ప్రకారమే తాము నడుచుకుంటామని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని టీఎంసీ ప్రతినిధులకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ స్పష్టం



చేసినట్లు వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపేయాలని దీదీ డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే సీఈసీతో భేటీ అయ్యేందుకు ఢిల్లీకి వచ్చారు. టీఎంసీ బృందంతోపాటు 'ఎస్ఐఆర్' బాధితులుగా చెబుతున్న పలువురితో కలిసి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. తన నిరసనకు గుర్తుగా ఆమె నల్ల శాలువాను ధరించారు. అయితే, సమావేశం మధ్యలోనే సీఎం వాకౌట్ చేసినట్లు తెలుస్తోంది. బయటకు వచ్చిన అనంతరం.. ఈసీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల సంఘం తమ ప్రతినిధి బృందాన్ని అవమానించిందని, భాజపాకు దళారీలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అంతకుముందు బంగ భవన్ వద్ద భారీగా పోలీసుల మోహరించడాన్ని ఆమె ఖండించారు. ఈ భేటీపై ఈసీ అధికారులు స్పందిస్తూ.. "మొదట టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ మాట్లాడారు. ఆ తర్వాత మమత మాట్లాడారు. వారు లేవనెత్తిన అంశాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు ఎస్.ఎస్.సంధు, వివేక్ జోషి నమోదు చేసుకున్నారు. సీఈసీ జవాబు ఇచ్చేలోపే టీఎంసీ నేతలు పలుమార్లు అడ్డుతగిలారు. అంతలోనే ముఖ్యమంత్రి ఆగ్రహంతో సమావేశం నుంచి వెళ్లిపోయారు" అని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నిమగ్నమైన సిబ్బందికి ఎటువంటి ఆటంకాలు కలిగించొద్దని టీఎంసీ బృందానికి సీఈసీ సూచించినట్లు చెప్పారు.

## ఇంధన స్విచ్‌లో లోపం..? ఎయిరిండియా విమానం నిలిపివేత

ఎయిరిండియాకు చెందిన ఓ డ్రీమ్‌లైనర్ విమానంలోని ఇంధన నియంత్రణ స్విచ్‌లో లోపం తలెత్తినట్లు సమాచారం. పైలట్ ఫిర్యాదు మేరకు ఆ విమానాన్ని నిలిపేసినట్లు విమానయాన సంస్థ తెలిపింది. ఈ విషయాన్ని డీజీసీఏ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించింది. ఈ బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం లండన్ నుంచి బయల్దేరి సోమవారం ఉదయం బెంగళూరు విమానాశ్రయంలో ల్యాండ్ అయినట్లు సంబంధిత వర్గాలు చెప్పాయి. "ఏఐ132 సర్వీసు బోయింగ్ విమానం ఇంధన నియంత్రణ స్విచ్‌లో లోపం ఉందని మా పైలట్లలో ఒకరు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ విమానాన్ని నిలిపివేశాం. విమాన తయారీ సంస్థ




నిపుణులతో తనిఖీలు చేయిస్తున్నాం. ఈ విషయాన్ని డీజీసీఏ దృష్టికీ తీసుకెళ్లాం. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు.. ఎయిరిండియాకు చెందిన అన్ని బోయింగ్ 787 విమానాల్లో ఇంధన నియంత్రణ స్విచ్‌లను తనిఖీ చేశాం. ఎటువంటి సమస్యలూ గుర్తించలేదు" అని ఎయిరిండియా ఓ ప్రకటనలో తెలిపింది. ఇంధన స్విచ్‌ల వైఫల్యంతోనే గతేడాది అహ్మదాబాద్ విమాన ప్రమాదం చోటుచేసుకున్నట్లు విమాన ప్రమాదాల దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) తన ప్రాథమిక నివేదికలో తేల్చిన విషయం తెలిసిందే. సెకను వ్యవధిలో విమానం రెండు ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడంవల్లే దుర్ఘటన జరిగిందని ఏఏఐబీ తెలిపింది. ఈ నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.

## అవి నేను చెప్పిన మాటలు కావు: రాహుల్ గాంధీ

దేశ భద్రతకు సంబంధించిన అంశాన్ని లోక్‌సభలో లేవనెత్తేందుకు ప్రభుత్వం అనుమతించడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భారత సరిహద్దుల్లోకి చైనా సైన్యం చొరబడుతోందనేవి తాను చెప్పే మాటలు కాదని.. స్వయంగా ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణే తన పుస్తకంలో రాశారని అన్నారు. ఈ పుస్తకం బయటకు వస్తే అసలు విషయాలు ప్రజలకు తెలిసిపోతాయనే భయంతో ఆ పుస్తక ప్రచురణను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు. లోక్‌సభ వాయిదా పడిన అనంతరం రాహుల్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. నరవణే రాసిన పుస్తకం పబ్లిష్ అయితే ప్రభుత్వ నేతలు మన సైన్యాన్ని ఎలా నిరాశపరిచారనే విషయాలు ప్రజలు తెలుసుకుంటారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. జాతీయ భద్రతకు సంబంధించిన



విషయాలన్నీ చెబుతాననే భయంతో తనను మాట్లాడనీయకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు.

*** ప్రభుత్వం అతిగా స్పందించింది: శశిథరూర్**

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై లోక్‌సభలో ప్రభుత్వ పక్షం అతిగా స్పందించిందని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వ్యాఖ్యానించారు. "రాహుల్ లేవనెత్తాలనుకున్న విషయం ప్రజలకు తెలిసిందే. ఆయన ఓ మ్యాగజైన్‌లో ప్రచురితమైన కథనం ఆధారంగా మాట్లాడారు. సంబంధిత పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదని ప్రభుత్వం అభ్యంతరం చెప్పే బదులు.. ఆయనకు మాట్లాడే అవకాశం ఇవ్వాల్సింది" అని అన్నారు.

ఎందుకు భయపడుతున్నారు?: ప్రియాంక గాంధీ రాహుల్ గాంధీ మాట్లాడుతున్న మాటల్లో నిజం లేకపోతే, వాటికి సరైన ప్రామాణికత లేకపోతే కేంద్ర ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. పుస్తకంలోని ఒక్క లైన్ గురించి రాహుల్ ప్రస్తావించగానే అధికార పక్ష సభ్యులు అంత ఆగ్రహానికి గురవ్వాల్సిన అవసరం ఏముందన్నారు.

## తన 'కృత్రిమ కాళ్ల'ను టేబుల్‌పై పెట్టి.. ప్రతిపక్షాలను నిలదీసిన భాజపా ఎంపీ

ఏదైనా విషయంలో కేంద్రాన్ని గుడ్డిగా వ్యతిరేకించొద్దని భాజపా ఎంపీ సి.సదానందన్ మాస్టర్ ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా ఆయన రాజ్యసభలో ఈమేరకు తొలి ప్రసంగం చేశారు. ఈ క్రమంలోనే తన రెండు కృత్రిమ కాళ్లను తీసి టేబుల్‌పై పెట్టి.. విపక్షాలను నిలదీయడం చర్చనీయాంశమైంది. "ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న వారే.. 31 ఏళ్ల క్రితం కేరళలో నాపై దాడి చేశారు. ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో.. కొంతమంది పథకం ప్రకారం రోడ్డుపై నన్ను వెనుక నుంచి పట్టుకుని, నా కాళ్లను నరికేశారు" అని సదానందన్ మాస్టర్ గుర్తుచేసుకున్నారు. అయితే, కృత్రిమ కాళ్లను ప్రదర్శించడాన్ని సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్ తప్పుపట్టారు. ఇది నిబంధనల ఉల్లంఘనేనని



'పాయింట్ ఆఫ్ ఆర్డర్' లేవనెత్తారు. ఈ క్రమంలోనే బ్రిటాస్‌కు సదానందన్ బదులిస్తూ.. "ప్రజాస్వామ్యం అంటే ఏంటో దేశానికి, ప్రజలకు చూపించాలనుకుంటున్నాను. మీరు ఎప్పుడూ ప్రజాస్వామ్యం, సహనం, మానవత్వం గురించి మాట్లాడుతుంటారు. కానీ, మీ నిబద్ధత రాజకీయ హింసపై ఆధారపడి ఉంది. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు" అని వ్యాఖ్యానించారు. అనంతరం ఆ కృత్రిమ కాళ్లను టేబుల్‌పై నుంచి తొలగించారు.

## ప్రయాణికుడిపై వేడి కూర.. ఇండిగోకు జరిమానా

దేశీయ విమానయాన సంస్థ ఇండిగో మరోసారి వార్తల్లో నిలిచింది. ఆ సంస్థ విమానంలో ప్రయాణికుడిపై వేడి కూర పడటంతో బాధితుడు వినియోగదారుల న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారించిన ఫోరమ్ ఇండిగోకు రూ.25వేల జరిమానా విధించింది. 2024 మార్చి 5న బ్యాంకాక్ నుంచి బెంగళూరుకు వచ్చిన ఇండిగో విమానంలో ఓ ప్రయాణికుడికి చేదు అనుభవం ఎదురైంది. సిబ్బంది ఫుడ్ సర్వ్ చేస్తున్న సమయంలో వేడికూర ప్రయాణికుడిపై పడింది. దీంతో ఆయన దుస్తులు పాడయ్యాయి. వెంటనే సిబ్బంది క్షమాపణలు తెలిపారు. విషయం తెలిసిన విమానయాన సంస్థ పరిహారంగా రూ. 5వేల ట్రావెల్ వోచర్‌ను ఆఫర్ చేసింది. ఆయన దాన్ని తిరస్కరించారు. దీనిపై ఫోరంను ఆశ్రయించారు. "వేడి కూర నాపై పడటంతో శరీరం కాలింది. నేను శాకాహారిని. మాంసాహారం మీద పడటంతో ఆ వాసన భరించలేకపోయాను. నా దుస్తులు, ఫోన్, వాచ్ అన్నీ పాడయ్యాయి. తోటి వారి ముందు నవ్వులపాలయ్యా. విమానం దిగేంత వరకు మానసిక వేదన అనుభవించా. సిబ్బంది




నిర్లక్ష్యంతోనే ఇదంతా జరిగింది" అని ఆ ప్రయాణికుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు గానూ విమానయాన సంస్థ నుంచి రూ. 5 లక్షల పరిహారం కావాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం బాధితుడికి రూ.20 వేలు చెల్లించాలని, పిటిషన్ ఖర్చుల నిమిత్తం మరో రూ. 5 వేలు ఇవ్వాలని ఇండిగోను ఆదేశించింది.

## 9 పేజీల సూసైడ్ నోట్ రాసి: 'రాయ్' కేసులో కీలక విషయాలు


కాన్ఫిడెంట్ గ్రూప్ అధినేత సీజేరాయ్ ఆత్మహత్య వ్యవహారంలో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో తాజాగా తొమ్మిది పేజీల సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐటీ సోదాలు జరుగుతుండగానే రాయ్ ఈ లేఖ రాసినట్టు వార్తలు వస్తున్నాయి. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఆ తొమ్మిది పేజీల సూసైడ్ నోట్‌లో వ్యక్తిగత విషయాలు, ఆర్థిక, వ్యాపార లావాదేవీల గురించి సీజేరాయ్ వివరంగా ప్రస్తావించారు. రాయ్ ఆత్మహత్య ఘటనను విచారించేందుకు ఏర్పాటైన సిట్.. ఈ నోట్‌ను పరిశీలిస్తోంది. అందులో ఆయన తన కుటుంబానికి క్షమాపణలు చెప్పారు. వ్యక్తిగత, వృత్తిగత అంశాలపై కుటుంబానికి సవివరంగా సూచనలు చేశారు. తనకు బాకీపడిన వారి



వివరాలు, తన మరణం తర్వాత వ్యాపారాన్ని నిర్వహించే వారసుల పేర్లు ప్రస్తావించారు. అలాగే తన సంస్థలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించొద్దని వారసులను కోరడం గమనార్హం. ప్రస్తుతం రాయ్ భార్య, ఆయన పిల్లల వాంగ్మూలాలన్ని అధికారులు రికార్డు చేస్తున్నారు. వ్యాపారాలకు సంబంధించిన పలు విషయాలు తన సతీమణికి తెలుసని గతంలో ఓ యూట్యూబ్ వీడియోలో రాయ్ పేర్కొన్నారు. ఒకవైపు ఐటీ సోదాలు జరుగుతుంటే.. ఆయన తొమ్మిది పేజీల లేఖ ఎలా రాశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## 'ఐరోపా సైన్యం' ఏర్పాటు.. అత్యంత ప్రమాదకరం: ఈయూ ప్రతినిధి


గ్రీన్‌లాండ్ విషయంలో ఇటీవల అమెరికా, ఐరోపా దేశాల మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ పరిణామాల నేపథ్యంలో యురోపియన్ ఆర్మీ ఏర్పాటు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. అయితే, దీన్ని ఈయూ ఫారిన్ పాలసీ చీఫ్ కాజా కల్లాస్ వ్యతిరేకించారు. ఐరోపా సైన్యం ఏర్పాటు చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. "ఐరోపా సైన్యం అవసరమని చెప్పేవారు.. బహుశా ఈ విషయాన్ని ప్రాక్టికల్‌గా ఆలోచించి ఉండరు. యూరప్ దేశాలు ఇప్పటికే నాటోలో ఉన్న నేపథ్యంలో.. ఒక ప్రత్యేక సైన్యాన్ని సృష్టించలేరు. యుద్ధం వంటి సంక్షోభ సమయాల్లో 'ఎవరు ఎవరికి



ఆదేశాలు జారీ చేస్తారు?' అనేది ముఖ్యమైన అంశం. ఒకవేళ నాటో, ఐరోపా సైన్యం రెండూ ఉంటే.. అప్పుడు పరిస్థితి గందరగోళంగా మారుతుంది. ఇది అత్యంత ప్రమాదకరం" అని నార్వేలో నిర్వహించిన ఓ భద్రతా సమావేశంలో కల్లాస్ వ్యాఖ్యానించారు. నార్వే ప్రధాని జోనాస్ సైతం యురోపియన్ ఆర్మీ అంశాన్ని వ్యతిరేకించారు. నాటో స్వతహాగా సంక్లిష్టమైనదని, అయినప్పటికీ.. పని చేయగలదని తెలిపారు. అగ్రరాజ్యం మద్దతు లేకపోతే ఐరోపాకు రక్షణే లేదని ఇటీవల నాటో చీఫ్ మార్క్ రుట్టే హెచ్చరించిన విషయం తెలిసిందే. రక్షణ విషయంలో అమెరికా, నాటోపై ఆధారపడాల్సి రావడం, ఉక్రెయిన్ రష్యా యుద్ధం, గ్రీన్‌లాండ్ విషయంలో అమెరికా వైఖరి వంటి పరిణామాల నేపథ్యంలో యురోపియన్ ఆర్మీ ఏర్పాటు అంశం చర్చల్లో నిలుస్తోంది. ఐరోపా తనను తాను రక్షించుకునేలా ఓ సైన్యం అవసరమని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ చాలా కాలంగా చెబుతున్నారు. లక్షమందితో ఐరోపా సైన్యం అవసరమని యురోపియన్ కమిషనర్ ఫర్ డిఫెన్స్ అండ్ స్పేస్ ఆండ్రియస్ కుబిలియస్ ఇటీవల చెప్పారు.

## భారత్‌పై మస్క్ పోస్ట్.. రాహుల్ గాంధీకి చురకలు

ప్రపంచ వృద్ధికి భారత్ చోదకశక్తిగా ఉందంటూ ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ పెట్టిన పోస్ట్‌పై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. ప్రపంచ జీడీపీ వృద్ధి రేటులో భారత్.. అమెరికా కంటే ముందున్నట్లు మస్క్ షేర్ చేసిన గణాంకాలను ఆమె ఉదహరించారు. ప్రపంచ జీడీపీ వృద్ధి రేటులో చైనా 26 శాతం వాటాను అందిస్తుండగా.. భారత్ 17 శాతం వాటాను, అమెరికా 9.9 శాతం వాటాను కలిగిఉందన్నారు. 43 శాతం వృద్ధి రేటు చైనా, ఇండియా ఆర్థిక వ్యవస్థల నుంచే వస్తోందని





పేర్కొన్నారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతుందనడానికి ఇదో చక్కటి ఉదాహరణ అని వివరించారు. ఓవైపు భారత్ వేగంగా అభివృద్ధి చెందుతుంటే ప్రతిపక్ష నేతలు మాత్రం దేశ ఆర్థిక పరిస్థితులపై విదేశాల్లో తప్పుడు ప్రచారాలు, ప్రకటనలు చేస్తున్నారని నిర్మలా సీతారామన్ రాహుల్ గాంధీని దుయ్యబట్టారు. త్వరలో చైనాను కూడా దాటి మరింత ముందుకువెళ్లడానికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

*** భారత్‌ను తక్కువ చేసి.. మాట్లాడొద్దు: కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు**

విదేశీ పర్యటనల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్‌ను కించపరిచేలా మాట్లాడతారని.. అది ఏమాత్రం సరైన చర్య కాదని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్ష నేతకు చురకలు అంటించారు. భారత్‌ది మృత ఆర్థిక వ్యవస్థ అని గతంలో రాహుల్ చేసిన విమర్శలను ఆయన ప్రస్తావించారు. తాను సాధారణంగా విదేశీయులు చేసే పోస్టులపై స్పందించనని.. కానీ ఓ బాధ్యత గల పౌరుడి స్థానంలో ఉండి.. దేశాన్ని ఇతరుల ముందు తక్కువ చేసి మాట్లాడొద్దని రాహుల్‌కు తెలిపేందుకే మస్క్ పోస్టుపై స్పందిస్తున్నట్లు తెలిపారు.




# తెలంగాణ అరకు లోయ!

నేచర్ అంటే అందరికీ ఇష్టమే. కానీ, దాన్ని ఎంజాయ్ చేయాలంటే మాత్రం తీరిక ఉండదు చాలామందికి. అందుకే కొందరు టూర్‌కి వెళ్లాలంటే ముందుగానే ప్లాన్ చేసుకుంటూ ఉంటారు. అయితే, దూరప్రాంతాలకు వెళ్లాలంటేనే ముందస్తు ప్లానింగ్ అవసరం. వీకెండ్స్‌లో టూర్ వెళ్లేవాళ్లకు అంత ముందస్తు ప్లానింగ్ అక్కర్లేదు. చూడదగ్గ ప్రదేశం దగ్గర్లో ఎక్కడ ఉందో తెలుసుకుంటే చాలు. ప్రస్తుతం హైదరాబాద్ సిటీకి దగ్గర్లోనే ఓ అందమైన ప్రదేశం ఉంది. అదే v. మరి దాని ప్రత్యేకతలేంటో తెలుసుకుందాం.



అనంతగిరి హిల్స్.... హైదరాబాద్ సిటీకి చాలా దగ్గర్లో ఉండే ప్రదేశాల్లో ఇదొకటి. వికారాబాద్ జిల్లాలో అనంతగిరి హిల్స్ ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని తెలంగాణ అరకులోయ అని చెప్పొచ్చు. ఇక్కడి పచ్చదనం, లోయలు, జలపాతాలు కనువిందు చేస్తాయి. గత కొంతకాలంగా ఇక్కడ మౌలిక వసతులతో పాటు వచ్చే టూరిస్టుల సంఖ్య కూడా పెరుగుతోంది. అందుకే సెలవులు, వీకెండ్ రోజుల్లో ఇక్కడ పర్యాటకుల తాకిడి ఇంకా ఎక్కువ ఉంటుంది. దీంతో తెలంగాణ టూరిజం 'హైదరాబాద్ నుంచి అనంతగిరి (వికారాబాద్) & బ్యాక్ వన్ డే టూర్ ప్యాకేజీ' పేరుతో ఈ టూర్ ప్యాకేజీని తీసుకొచ్చింది. ప్రతి శని, ఆదివారాల్లో ఈ ట్రిప్ అందుబాటులో ఉంటుంది. కేవలం ఈ ట్రిప్‌కు వెళ్తే చాలు ఒక్క రోజులో అనంతగిరి హిల్స్ చూసిరావొచ్చు.

**టూర్ షెడ్యూల్ :** ఈ ప్యాకేజీని హైదరాబాద్ సిటీ నుంచి ఆపరేట్ చేస్తుంది.

ప్రతి వీకెండ్ లోని శని, ఆదివారం తేదీల్లో ఈ టూర్ ప్యాకేజీ అందుబాటులో ఉంటుంది.

కేవలం ఒక్క రోజులోనే ట్రిప్ ముగుస్తుంది.

- టికెట్ ధరలు ఎలా ఉన్నాయంటే.. పెద్దలకు రూ. 1800, పిల్లలకు రూ. 1440గా ఉంది.

నాన్ ఏసీ బస్సులో వెళ్లాల్సి ఉంటుంది.

- ఉదయం 9 గంటలకు సికింద్రాబాద్ లోని యాత్రి నివాస్ నుంచి బస్సు బయల్దేరుతుంది. మధ్యాహ్నం 12 గంటలకు అనంతగిరి చేరుకుంటారు.
- సికింద్రాబాద్‌లోని యాత్రి నివాస్ వద్ద బస్సు ఎక్కాలి.
- ఉదయం 9 గంటలకు బస్సు స్టార్ట్ అవుతుంది.
- మధ్యాహ్నం 12 గంటలకు అనంతగిరి చేరుకుంటారు.
- మధ్యాహ్నం 12 నుంచి 12.30 వరకు మొదట అనంత పద్మనాభ స్వామి ఆలయ దర్శనం ఉంటుంది.
- అడవిలోకి వెళ్లి చూడాలనుకునే వారు మధ్యాహ్నం 12.30 నుంచి 01.30 గంటల వరకు చూడొచ్చు.
- మధ్యాహ్నం 01.30 నుంచి 02.30 వరకు హరిత హోటల్‌లో భోజనం(వెజ్) ఉంటుంది.
- 02.30 నుంచి 04.30 వరకు గేమ్స్ ఆడుకోవచ్చు.
- 04.30 నుంచి 5 గంటల మధ్యలో హరిత హోటల్‌లో టీ, స్నాక్స్ అందిస్తారు.
- తర్వాత సాయంత్రం 5 గంటలకు అనంతగిరి నుంచి హైదరాబాద్‌కు బస్సు బయలుదేరుతుంది.
- రాత్రి 8 గంటలకు హైదరాబాద్‌కు చేరుకోవడంతో ట్రిప్ ముగుస్తుంది.

టూర్ ప్యాకేజీ లేదా మరిన్ని వివరాల కోసం https://tourism.telangana.gov.in/ వెబ్ సైట్‌లో తెలుసుకోవచ్చు.



# ఇంటీరియర్‌తో ఇంటి లుక్ మార్చేయండి




రోజంతా ఎన్నో పనులతో బిజీగా గడుస్తుంది. దాంతో ఇంట్లో వస్తువులన్నీ ఎక్కడ పడితే అక్కడ ఉంటాయి. వాటిని చూడగానే సర్దేయాలి అనిపిస్తుంది. కానీ, టైం ఉండదు చాలామందికి. కాస్త టైం తీసుకుని సర్దుదాం అని అలానే వదిలేస్తుంటారు. అలాంటి వారికి వీకెండ్ వచ్చిందంటే.. కాస్త ఊపిరి పీల్చుకుంటారు. అయితే, ఇంటిని సర్దడం అంటే మాటలు కాదు. ఇంటికి రాగానే మైండ్ రీఫ్రెష్ అవ్వాలి. ఒత్తిడి, చిరాకు అన్నీ పోయి ప్రశాంతంగా ఉండాలి అని కోరుకుంటారు ఎవరైనా. మరి అలా ఉండాలంటే ఇంటీరియర్ డిజైనర్స్ చెప్పిన ఈ టిప్స్ ఫాలో అవ్వండి.

**ట్రెండీగా వద్దు!**

ఇల్లు మరీ ట్రెండీగా ఉండకూడదు. అలాగని మరీ పాత కాలం దానిలా కూడా ఉండకూడదు. కాస్త కొత్తగా, కొంచెం పాతకాలం లుక్‌తో ఉండేలా చూసుకోవాలి. ఇప్పుడు అవే ట్రెండింగ్‌లో ఉన్నాయి అంటున్నారు ఇంటీరియర్ డిజైనర్లు. ఇలా పాత కొత్తల మేలు కలయిక ఇంటికి కొత్త అందాన్ని తెచ్చి పెడుతుంది. అందుకనే అలంకరించుకునే వస్తువుల విషయంలో కొన్ని పాత వస్తువుల్నీ చేర్చమని సలహా ఇస్తున్నారు.

**లైటింగ్ ఇంపార్టెంట్**

ఈ మధ్య కాలంలో చాలా ఇళ్లు హెవీ లైటింగ్‌తో వెలిగిపోతున్నాయి. కానీ, అవి అంత మంచివి కాదు. అంత లైటింగ్ ఉంటే అవి మన జీవ గడియారాన్ని అస్తవ్యస్తం చేస్తాయి. ప్రతి గదిలోనూ ఒక మామూలు లైట్, ఒకలో లైట్‌ని అమర్చుకోండి. అవసరాన్ని బట్టి షాండ్లియర్లను ఏర్పాటు చేసుకోండి. రాత్రి పూట తక్కువ వెలుతురు ఉండే వార్మ్ లైట్‌లు వాడండి. వెలుగు తగ్గితే త్వరగా నిద్ర పడుతుంది.

**యాంక్సెంట్ వాల్ తో లుక్ :**

కుటుంబం అంతా కూర్చుని సమయం గడిపే హాల్ లో ఒక గోడను యాక్సెంట్ వాల్‌గా మార్చండి. మంచి లుక్ ని ఇచ్చే వాల్ పేపర్, కాస్త ముదురు రంగు పెయింట్‌తో యాక్సెంట్ వాల్‌ని మీకు నచ్చినట్లు తయారుచేసుకోవచ్చు. అలాగే చెక్కలతోనూ రకరకాల ఆకారాలను తీసుకురావచ్చు.

**ఫర్నిచర్ ఇలా ఉండాలి :**

ఇంట్లో సోఫాలు, కుర్చీలు, మంచాల్లాంటి వాటిని ఎంపిక చేసుకునేప్పుడు అవి సౌకర్యవంతంగా, ఉపయోగకరంగా ఉండేలా చూడండి. అనవరంగా ఏ ఒక్క వస్తువునూ ఇంట్లో పెట్టొద్దు. సింప్లిసిటీతో మంచి లుక్ వచ్చే వాటిని ఎంపిక చేసుకోండి. ఎక్కువ హడావిడి ఉన్న వాటి జోలికి అస్సలు వెళ్లకండి.

**సహజ కాంతి బెటర్ :**


ఇంట్లో ఎన్ని అలంకరణలు చేసినా సరే సహజమైన కాంతి తగినంత రాకపోతే అందమే రాదు. అందుకనే కిటికీ అద్దాల విషయంలో జాగ్రత్తలు తీసుకోండి. గాలి,

# ఈ మొక్కలు ఉంటే.. దోమలు పరార్

కాలంతో సంబంధం లేకుండా దోమలు ఎప్పుడూ ఇబ్బంది పెడుతుంటాయి. ఇక వానాకాలంలో అయితే దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. వీటి నుంచి తప్పించుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అయినా వాటి నుంచి రక్షించుకోవడం కష్టమే. పైగా వాటికోసం వాడే రిపెల్లెంట్ లిక్విడ్లు, మస్కిటో కాయిల్స్ వల్ల మన ఆరోగ్యం పాడవుతుందని స్టడీల్లో తేలింది. ముఖ్యంగా పిల్లలకు, పెద్దలకు శ్వాసకోశ సంబంధమైన సమస్యలు వస్తాయని తెలిసింది. మరి వీటికి దూరంగా ఉంటూనే మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే కొన్ని మొక్కల్ని ఇంటి పరిసరాల్లో పెంచుకుంటే సరిపోతుంది. ఎందుకంటే ఈ మొక్కలు ఉంటే దోమలు దరిదాపుల్లోకి కూడా రావు. ఇవి సహజమైన రిపెల్లెంట్‌లు.



**పుదీనా :** పుదీనా మొక్కల్ని కిటికీలు, గుమ్మాల దగ్గర పుదీనా మొక్కల్ని పెంచుకోవచ్చు. ఇవి ఉంటే, దోమలు, ఈగలు, పురుగులు రావు. అవి ఎక్కువగా ఉన్నచోట పుదీనా రసం స్ప్రే చేసతే వెంటనే పరిష్కారం అవుతుంది.



**బంతి :** బంతిపూల మొక్క ఇంటి పరిసరాల్లో ఉంటే దోమలు రావు. మనదేశంలో వీటిని సీజనల్‌గా పెంచుకుంటారు. కానీ, ఆఫ్రికన్ బంతితోపాటు, ముదురు ఎరుపు రంగులో ఉండే కృష్ణ బంతి మొక్కల్ని కిటికీలు, గుమ్మాల దగ్గర్లో పెట్టాలి. వీటి వాసనకు సహజంగానే పురుగులు, దోమలు రాకుండా ఉంటాయి.

**నిమ్మ గడ్డి :** దీన్ని లెమన్ గ్రాస్ అంటారు. ఈ మొక్క దోమల నివారణకు బాగా పనికొస్తుంది. నిమ్మ గడ్డి నుంచి నూనె కూడా తయారుచేస్తారు. దోమలు ఉన్న చోట ఆ నూనెను స్ప్రే చేస్తే 95 శాతం దోమలు చనిపోతాయి అని రీసెర్చ్‌లో తేలింది. అందుకే దీన్ని బెస్ట్ మస్కిటో రిపెల్లెంట్ అంటారు.

**తులసి :** తులసి జాతిలో చాలా రకాల మొక్కలు ఉంటాయి. వాటి ఆకుల ఆకారం, రంగుల్లో కొద్దిగా తేడాలుంటాయి. తులసి జాతి మొక్క ఏదైనా ఇంటి చుట్టుపక్కల ఎక్కువగా పెంచుకోవడం వల్ల దోమలు రావు.



## పౌరాణిక పాత్రల్లో ఒదిగిపోవాలి

### పాత్రల్లో పరకాయ ప్రవేశం చేయాల్సిందే

### రామాయణ మూవీపై అరుణ్ గోవిల్



**టాకీస్:** బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ' సినిమాలోని పాత్రల గురించి నటుడు అరుణ్ గోవిల్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇలాంటి చిత్రాల్లో నటీనటుల లుక్స్‌పై ప్రేక్షకులు ఎక్కువగా ఫోకస్ చేస్తారని తెలిపారు. వారిని జీవితమంతా అదే పాత్రలో గుర్తుంచుకుంటారని అన్నారు. రామానంద్ సాగర్ తెరకెక్కించిన 'రామాయణ్'లో అరుణ్ రాముడిగా కనిపించారు. అప్పటినుంచి రాముడి పాత్ర అనగానే ఆయనే గుర్తుండిపోయేలా అందులో కనిపించి ఆకట్టుకున్నారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో రానున్న 'రామాయణ'లో అరుణ్ గోవిల్ దశరథుడి పాత్రలో కనిపించనున్నారు. దీని గురించి మాట్లాడుతూ.. 'ఏదైనా సినిమా వస్తుందంటే దానిని పోల్చడానికి ప్రేక్షకులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. మనం దేవుడి పాత్ర పోషించేటప్పుడు చూడగానే అలానే కనిపించాలని. లుక్స్ చాలా ముఖ్యం. ఆడియన్స్ తెరపై మనల్ని చూడరు.. మన పాత్రలో ఉన్న దేవుడిని చూస్తారు. బహుశా దేవుడు నిజంగా ఇలానే ఉండటాడేమో అనుకోవాలి. అంతలా మనం ప్రభావితం చేయాలని చెప్పారు.

## మూవీగా వస్తోన్న మీర్జాపూర్ వెబ్ సిరీస్




**టాకీస్:** యాక్షన్ క్రైం థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకొచ్చి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచిన ఫ్రాంచైజీ సిరీస్ మీర్జాపూర్. ఈ సిరీస్‌లో ఇప్పటికే మూడు సీజన్లు సందడి చేశాయి. పవర్ ఫుల్ క్యారెక్టర్లతో సాగే మూడు సీజన్లకు ప్రేక్షకుల వద్ద నుంచి అదిరిపోయే స్పందన వచ్చింది. కాగా ఈ యూనివర్స్‌ను మరింత ఎక్కువ మంది ప్రేక్షకులకు అందించేందుకు మేకర్స్ సరికొత్త ప్లాన్‌తో వస్తున్నారు. మీర్జాపూర్ ఇక ఫీచర్ ఫిల్మ్‌గా రానుంది. ఈ సినిమా కథను థియేటర్లలో అద్భుతమైన థియాట్రికల్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా డిజైన్ చేశారని ఇన్‌సైడ్ టాక్. మీర్జాపూర్ ది ఫిల్మ్ అధికారికంగా షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకున్న ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉందని తెలియజేశారు. క్రైం సాగాను బిగ్ స్క్రీన్‌పై ఎలా చూపించబోతున్నారని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్. ఈ చిత్రంలో పాపులర్ యాక్టర్లు పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గుర్మీత్ సింగ్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రానికి పునీత్ కృష్ణ కథనందిస్తున్నారు. ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రితేశ్ సిధ్వానీ, ఫర్హాన్ అక్తర్ నిర్మిస్తున్నారు. విడుదలకు సంబంధించిన వివరాలపై త్వరలోనే క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. గుర్మీత్‌సింగ్, ఆనంద్ అయ్యర్ సంయుక్తంగా దర్శకత్వం వహించిన మీర్జాపూర్ వెబ్ సిరీస్‌లో పంకజ్ త్రిపాఠి, శ్వేతా త్రిపాఠి, అలీ ఫజల్, హర్షిత గౌర్, విజయవర్మ తదితరులు నటించారు.



MOVIE TIME

# అతడి ప్రవర్తన చూసి దూరం పెట్టాను

### మాజీ ప్రియుడి గురించి మృణాల్ కామెంట్స్

**టాకీస్:** కొన్ని రోజులుగా ప్రేమ, పెళ్లి అంశాల్లో వరుసగా వార్తల్లో ఉంటున్నారు నటి మృణాల్ ఠాకూర్. తాజాగా ఆమె తన మాజీ ప్రేమికుడి గురించి చెప్పి మరోసారి నెట్టింట వైరల్‌గా మారారు. అతడితో బంధం ముగిసిపోయినందుకు తానేమీ బాధ పడలేదని తెలిపారు. ఆమె నటించిన తాజా చిత్రం 'దో దీవానే శహర్ మే' ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకురానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన మాజీ ప్రేమికుడి గురించి ప్రస్తావించారు. నాకు దూకుడు ఎక్కువని నాతో ఉండలేనని బ్రేకప్ చెప్పాడు. నేను యాక్టింగ్ చేయడం కూడా తనకు నచ్చలేదు. విడిపోవడానికి అది కూడా ఓ కారణం. బ్రేకప్ చెప్పినందుకు నేనేం బాధపడలేదు. తన మనస్తత్వం గురించి జాలి పడ్డాను. అలాంటి వాళ్లతో కొనసాగడం కూడా కష్టమే. అందుకే విడిపోయాం. అలాంటివాళ్లతో ఉంటే భవిష్యత్తులో పిల్లలు కూడా అదే భావనలతో పెరుగుతారు. అది నాకు ఇష్టం లేదని మృణాల్ తెలిపారు.కొన్ని నెలలుగా మృణాల్ డేటింగ్ వార్తలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. నటుడు ధనుష్ తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు ప్రచారం జరిగింది. ధనుష్ తనకు మంచి స్నేహితుడంటూ ఆ ప్రచారాన్ని మృణాల్ ఖండించారు. తర్వాత టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌తో ఆమె డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. వీటిపై స్పందిస్తూ.. 'ఇలాంటి రూమర్స్ వినడానికి కూడా హాస్యాస్పదంగా ఉంటాయి. వాళ్లు వార్తలు సృష్టిస్తుంటారు. వాటిని చూసి నేను నవ్వుకుంటాను. ఫ్రీ పీఆర్ స్టంట్స్ ఇవి' అంటూ వాటికి చెక్ పెట్టారు.


# జైలర్-2లో షారూఖ్ ఖాన్



**టాకీస్:** తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ క్రేజీ సీక్వెల్ జైలర్ 2. తలైవా టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రానికి కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. సీక్వెల్‌లో శివరాజ్‌కుమార్, మోహన్ లాల్ పాత్రలు రిపీట్ కానున్నాయని ఇప్పటికే వార్తలు వచ్చాయి. మరోవైపు తాజాగా బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నాడని అప్‌డేట్ కూడా వచ్చింది. కాగా దీనిపై అఫీషియల్ న్యూస్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. జైలర్ 2 నెక్ట్స్ షెడ్యూల్ ముంబైలో జరుగనుంది. తాజా సమాచారం ప్రకారం వచ్చే వారం షురూ కానున్న ఈ షెడ్యూల్‌లో షారుక్ ఖాన్ జాయిన్ అవ్వబోతున్నాడు. ఈ షెడ్యూల్‌లో షారుక్‌ఖాన్‌పై వచ్చే కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మొత్తానికి నెల్సన్ దిలీప్ కుమార్ షారుక్ ఖాన్‌ను ఎలాంటి స్పెషల్ రోల్‌లో చూపించబోతున్నాడు.. తలైవా, షారుక్ ఖాన్ కాంబోలో సీన్లుంటాయా..? అన్నది తెలియాల్సి ఉంది. సిల్వర్ స్క్రీన్‌పై ఇద్దరు స్టార్ యాక్టర్లను చూసేందుకు ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్, అభిమానులు. జైలర్ 2ను 2026 జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నామని ఇప్పటికే రజినీకాంత్ క్లారిటీ కూడా ఇచ్చాడని తెలిసిందే. సీక్వెల్‌లో బాలీవుడ్ భామ విద్యాబాలన్‌తోపాటు కోలీవుడ యాక్టర్ సంతానం కీలక పాత్రల్లో నటిస్తున్నారని తెలుస్తుండగా.. మరి రాబోయే రోజుల్లో ఈ స్టార్ యాక్టర్లపై అఫీషియల్ అప్‌డేట్ ఏమైనా ఇస్తారేమో చూడాలి. జైలర్ ఫస్ట్ పార్టులో రమ్యకృష్ణ, వినాయకన్, వసంత్ రవి, మోహన్ లాల్, శివరాజ్ కుమార్, తమన్నా కీలక పాత్రల్లో నటించారని తెలిసిందే. సీక్వెల్‌లో ఎవరెవరుండ బోతున్నారన్నదానిపై మేకర్స్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

## ఓటీటీలో ట్రెండ్ అవుతున్న శంబాలా


**టాకీస్:** ఆది సాయికుమార్ నటించిన మిస్టిల్ థ్రిల్లర్ మూవీ 'శంబాల'. గతేడాది చివర్లో విడుదలైన ఈ సినిమా జనవరి 22న ఆహా వేదికగా ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. తాజాగా ఈ చిత్రం ఓటీటీలో రికార్డు సృష్టించింది. 10 రోజుల్లో 100 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్ దాటి అత్యధికంగా వీక్షించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ.. ప్రేక్షకులకు చిత్రబృందం కృతజ్ఞతలు తెలిపింది. యుగంధర్ ముని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అర్చన అయ్యర్ హీరోయిన్. కథేంటంటే..: 1980వ దశకం నేపథ్యంలో సాగే కథ ఇది. వెయ్యేళ్ల చరిత్ర ఉన్న ఓ ఊరు శంబాల. అక్కడ ఆకాశం నుంచి ఓ ఉల్క పడుతుంది. అప్పటినుంచి ఊరిలో అనూహ్యమైన సంఘటనలు జరగడం మొదలవుతాయి. ఉన్నట్టుండి ఎవరో ఒకరు విచిత్రంగా ప్రవర్తిస్తూ హత్యలు చేస్తారు, ఆత్మహత్యలకు పాల్పడతారు.




దాంతో బండ భూతం ఆవహించిందంటూ ఊరి జనం భయంతో వణికిపోతుంటారు. మూఢ నమ్మకాలు రాజ్యమేలుతాయి. ఆ రహస్యాలను ఛేదించేందుకు ప్రభుత్వం విక్రమ్ (ఆది సాయి కుమార్) అనే యువ శాస్త్రవేత్తని ఆ గ్రామానికి పంపిస్తుంది. సైన్స్‌నే నమ్ముకుని విధులు నిర్వర్తించే విక్రమ్ ఆ ఊళ్లో జరుగుతున్న సంఘటనల వెనక రహస్యాల్ని ఛేదించాడా? ఆ ఊరిలో కనిపించిన దేవి (అర్చన అయ్యర్) ఎవరు? విక్రమ్ నమ్ముకున్న సైన్స్‌కీ, ఊరి చరిత్ర వెనకున్న శాస్త్రానికి మధ్య సంఘర్షణ ఎలా సాగిందన్నది మిగతా కథ.

## కొత్త తారలతో మ్యాడ్-3 చిత్రీకరణ

**టాకీస్:** టాలీవుడ్‌లో యూత్‌ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌లుగా భారీ విజయాలను అందుకున్న 'మ్యాడ్', 'మ్యాడ్ 2' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్లుగా నిలిచిన విషయం తెలిసిందే. దర్శకుడు కళ్యాణ్ శంకర్ తెరకెక్కించిన ఈ రెండు చిత్రాలు యువతను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఫన్, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌తో సాగిన ఈ సిరీస్‌కు ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది. నార్నె నవీన్, రామ్ నితిన్, సంగీత్ శోభన్ హీరోలుగా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఈ సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీకి కొనసాగింపుగా 'మ్యాడ్ 3' ను తెరపైకి తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించిన నిర్మాతలు, ఈసారి కొత్త కాన్సెప్ట్‌తో పాటు కొత్త కాస్టింగ్‌ను కూడా పరిచయం చేయాలని భావిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. గత చిత్రాల్లో కనిపించిన హీరోల స్థానంలో ఈసారి కొత్త యువ నటులను తీసుకొస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త కాస్టింగ్‌లో భాగంగా 'లిటిల్ హార్ట్స్' ఫేమ్ జేయ్ కృష్ణ, 'కోర్ట్' ఫేమ్ హర్ష్ రోషన్ పేర్లు వినిపిస్తున్నాయి. యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహిస్తూ ఫ్రెష్ ఫేస్‌లతో ఈ చిత్రాన్ని రూపొందించాలన్న ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో సినిమాకు 'మ్యాడ్ జూనియర్స్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు ఫిల్మ్‌నగర్‌లో ప్రచారం జరుగుతోంది.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.